ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (జువ్వలపాలెంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 6-11-1995)

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

కోరికతో చేసే పనులను విడిచిపెట్టటం సన్యాసము. కోరిక లేకుండా పని చేస్తూ ఆ పనివలన వచ్చే ఫలితమును విడిచిపెట్టటం త్యాగము. త్యాగము లేకుండా శాంతి కలుగదు. త్యాగము లేకుండా జ్ఞానము కలుగదు.

చైతన్యము మనహృదయంలో ఉంది. అది అనుభవంలోనికి వచ్చేవరకూ మనం చేసే ప్రయత్నం పూర్తికాదు. బేధబుద్ధి ఉంటే చైతన్యము అనుభవంలోనికి రాదు. చైతన్యము ఒకటిగా ఉంది గాని రెండుగా లేదు. మనలో రెండు నేనులు ఉన్నాయి. (1) నిజమైన నేను అదే చైతన్యము. (2) అబద్ధమైన నేను అదే అహంభావన. మనం నిజమైన నేనును పట్టుకోవాలి, అబద్ధమైన నేనును వదిలిపెట్టాలి. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే అబద్ధమైన నేనును పట్టుకుంటున్నాము, నిజమైన నేనును వదలివేస్తున్నాము. మనం పట్టుకోవలసిన దానిని వదలివేస్తున్నాము, వదలివేయవలసిన దానిని పట్టుకుంటున్నాము. మరచిపోవలసిన విషయాలను మరిచిపోవాలి. జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయాలను జ్ఞాపకం పెట్టుకోవాలి. కాని జ్ఞాపకం పెట్టుకోవలసిన విషయాలను మరిచిపోతున్నాము. అవసరము లేని విషయాలను జ్ఞాపకం పెట్టుకుంటున్నాము, వాటిని మోస్తున్నాము. ఇటువంటిలోపాలు సవరించుకోవాలి. కంగారు పడవద్దు. జ్ఞానం ఈ శరీరంలో ఉండగానే వస్తుంది. అన్వేషణయొక్క తీవ్రతనుబట్టి, సాధనయొక్క తీవ్రతను బట్టి అది వస్తుంది.

రాగద్వేషములు శాపములు అన్నారు ఆచార్యులవారు. ఇవి సమాజపరంగాను, కుటుంబ పరంగాను ఉపద్రవాలు తెచ్చిపెడుతున్నాయి. మనస్సు అంతర్ముఖంగా ప్రయాణం చేయటానికి సిద్ధపడినా రాగద్వేషములు మనస్సును బయటకు తీసుకుని వచ్చేస్తున్నాయి. భగవంతుని ప్రార్థించి వాటిని తొలగించుకోవాలి. అదే మనం చేయవలసిన సాధన. రాగద్వేషములు బేధబుద్ధిని తీసుకుని వస్తున్నాయి. బేధబుద్ధి ఉన్నంతకాలము జన్మలు వస్తూ ఉంటాయి.

భగవంతుని ధ్యానించటంవలన నీ చిత్తము యొక్క గతి మారుతుంది అని చెప్పారు. నీ మనస్సు ప్రకృతివైపుకు పరిగెడుతోంది. దాని గతిని మార్చాలంటే ఈశ్వరుని ధ్యానించు, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించు. అప్పుడు నీ మనస్సు యొక్క గతి మారుతుంది.

మనం బాగుపడాలి, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అనే భావన ఉన్నప్పుడు భగవంతుడు చెప్పినమాటలు విని, అర్థంచేసుకుని, వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నించాలి. మనకు మారటమే ఇష్టంలేనపుడు భగవంతుడు చెప్పినమాటలు అర్థంకావు. శరీరానికి తేలుకుడితే ఎలా ఉంటుందో అలాగే భక్తిభావం లేని మనుషులకు భగవంతుని మాటలు విన్నప్పుడు వారిమనస్సుకు తేలుకుట్టినట్లుగా ఉంటుంది. భగవంతుడు మన బాగుకోసం చెప్పాడు అని అర్థంచేసుకుని వాటిని శ్రవణం చేసి, మననం

చేస్తే అవి మనకు అనుభవంలోనికి వస్తాయి. భగవంతునియందు ధ్యాస కలిగి ఆయన చెప్పిన మాటలు వింటే మనకు మారు మనస్సు వస్తుంది. శ్రవణం లేకుండా, ధ్యానం లేకుండా మనం మారలేము.

గొడవలు అన్నీ అహంభావన వలననే వస్తున్నాయి. దానినుండి బయటకు రా అని చెపుతున్నారు. చెప్పటం చెపుతున్నారు, బయటకు రావటం అంతతేలికగా ఉందా? ఇది ఒక పెద్ద అడవిలా ఉంది, పైగా చీకటిలో ఉన్నాము. దారి చూపించేవాడు ఎవడో ఉండాలిగాని దీనినుండి బయటకు రావటం అంతతేలికా అని అడుగుతున్నారు. దారి చూపించమని అడుగుతున్నావు. ఇప్పుడు నీ మనస్సు బాహ్యాముఖంగా విజృంభిస్తోంది. దానిని అంతర్ముఖపరచి వెదుకు నీకు దారి కనిపిస్తుంది అంటున్నారు రమణాచార్యులు.

మానవునికి ఎంతసేపు ఇంద్రియసుఖాలతో, విషయసుఖాలతో కాలక్షేపం అయిపోతుంది. ఇంద్రియ సుఖాలకంటే ఆత్మసుఖము గొప్పది అని శ్రవణం చేస్తేనేగాని నీకు తెలియదు. ఇంద్రియ సుఖము క్షణికమైనది. పరిణామంలో దుఃఖమును తీసుకొని వస్తుంది. కాని ఆత్మసుఖము అటువంటిది కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. శరీరము ఉన్నా, ఊడిపోయినా ఉంటుంది. ఆత్మసుఖము ఒకసారి నీకు అనుభవంలోనికి వస్తే దానినుండి నీవు వేరుపడలేవు.

పూజచేసి, జపంచేసి భగవంతుని ఈ కోరిక నెరవేరుస్తావా లేదా అని నిలగొడితే ఆ కోరికను భగవంతుడు నెరవేరుస్తాడు. దానిని అనుగ్రహం అనరు. వరం అంటారు. మనం ఏమీ అడగకుండా ఉండటం అది పరాభక్తి. మనకు ఏది మంచిదో ఆయన ఇస్తాడు. అది అనుగ్రహం. నాకు ఏదిమంచిదో నాకంటే నీకే బాగా తెలుసు. నాకు ఏది మంచిదో నువ్వే చెయ్యి అని భగవంతుని మీద మినహాయింపులు లేకుండా తన భారమును పూర్తిగా వేసేవాడికి ఆయన అనుగ్రహం కలుగుతుంది. వరంవేరు, అనుగ్రహం వేరు. అడిగి తెచ్చుకునేది వరము. అడగకుండా వచ్చేది అనుగ్రహము.

ఈరోజు జువ్వలపాలెంలో ఇక్కడ కూర్చొని శ్రవణం చేస్తున్నారు అంటే ఇది ఈ రోజే వచ్చింది అనుకోకండి. జువ్వలపాలెంలో ఎంతోమంది ఉండవచ్చు. అందరూ వచ్చి శ్రవణం చేస్తున్నారా? లేదు. కొద్దిమందే వచ్చి శ్రవణం చేస్తున్నారు. శ్రవణం చేయడానికి కూడా యోగ్యత ఉండాలి, అర్హత ఉండాలి. అర్హత, యోగ్యత మనకు లేనపుడు దేవుడు వచ్చి మనఎదురుగా ఉన్నా చూడాలని అనిపించదు, వాడు చెప్పినది వినాలి అనిపించదు. మీరు పూర్వజన్మలో ఎంతో కొంతసాధన చేసారు, జ్ఞానం సంపాదించాలి అని ప్రయత్నం చేసారు. ఆ వాసనాఫలమే మిమ్మలను ఇక్కడకు తీసుకువచ్చి శ్రవణం చేయిస్తోంది.

మనం సాధన చేస్తున్నాము. ఫలితం రావటంలేదు. మనం సాధన చేస్తున్నప్పటికీ ఆ సాదనాఫలితము మన చేతికి అందకపోవటానికి కేవలము వైరాగ్యము లేకపోవటం ఒక్కటే కారణము. ఎంతో కొంతసాధన చేస్తున్నారు. ఏమీ చేయటంలేదు అని చెప్పటంలేదు. మనకు ఉండవలసినంత వైరాగ్యము లేదు. సాధనకు తోడు వైరాగ్యము చేకూరితే ఫలం చేతికి అందుతుంది. అహంభావనను వైరాగ్యమనే కత్తితో నరకాలిగాని వైరాగ్యం అనే అస్త్రము నీ చేతిలోలేనపుడు అహంభావననుండి బయట పడలేవు, జనన మరణప్రవాహమునుండి బయట పడలేవు అని కృష్ణుడు చెప్పాడు.

అహంభావన యొక్క మూలాన్ని వెతికితే అహంభావన నశిస్తుంది. అది నీకు చేతకాకపోతే ఏకవస్తువును చింతించటం వలన, నీకు ఇష్టమైన అవతార పురుషుని రూపమును నిరంతరము ధ్యానించటంవలన, నామమును స్మరించటంవలన అహంభావన నశిస్తుంది.

నీలో సుఖం ఉంది, శాంతి ఉంది. అవి నీకు అందకుండా అహంభావన మూతగా ఉంది ఓ పరమేశ్వరుడా! ఆ మూతను నేను బయటకు లాగలేకపోతున్నాను. మూతను బయటకు తీసే నా ప్రయత్నంలో నీవు సహకరించవయ్యా. నీ సహకారం లేకుండా ఆపనిని నేను పూర్తిచేయలేను అని ఉపనిషత్‌లో ఒక మహర్షి దేవుని ప్రార్థించాడు.

మనస్సు ఏ ఇంద్రియం ద్వారా ఏ విషయం మీదకు వెళుతోందో ముందుచూసుకో. ఆ విషయంలోనుండి మనస్సును ఉపసంహరించు. ఉపసంహరించి ఇష్టదైవముమీద నీ మనస్సును నిలబెట్టే అలవాటుచేసుకో. ఇది ఒకేసారి కుదరదు. క్రమేణా ధ్యానం చేసేస్థితి నీకు కుదురుతుంది. అప్పుడు నీవు బాగుపడతావు. మనస్సుకు ధ్యానం చేసేస్థితి ఎప్పుడైతే కుదిరిందో, మనస్సుకు ఎప్పుడైతే ఏకాగ్రత కుదిరిందో నీకు తెలియకుండానే అది లోపలకు ప్రవేశిస్తుంది. స్థూలమనస్సును విషయాలు ఎలా అయితే ఆకర్షిస్తాయో నీమనస్సు పవిత్రం అయినపుడు దేవుడు ఉన్నస్థానంవైపుకు నీ మనస్సు అలాగ ఆకర్షింపబడుతుంది. నీవు సాధన చేయగా చేయగా కొంతకాలమునకు నీ మనస్సు దేవుడు ఉన్నస్థానంవైపుకు ఆకర్షింపబడుతుంది.

సంసారంగొడవ, ప్రకృతిగొడవ ఇలా ఏదో ఒక గొడవ బాధపెడుతోంది. ఒక గొడవ వదిలితే ఇంకొక గొడవ వస్తోంది. ఏదోకారణంగా దుఃఖము వెంటాడుతోంది. విచారణ చేయాలన్నా ధ్యానం చేయాలన్నా, మంచిచేయాలన్నా మనస్సు ఎప్పుడూ దుఃఖములో ఉంటే మేము ఏమిచేస్తాము అని అడుగుతున్నారు. నీ మనస్సు దుర్బలంగా ఉంది, బలహీనంగా ఉంది, నీ మనస్సు ఏ విషయాన్ని తట్టుకోలేకపోతోంది. నీమనస్సుకు ఇప్పుడు తట్టుకొనే శక్తి కావాలి. నెమ్మదిగా, నిదానంగా, స్థిరంగా, శాంతంగా నీ మనస్సుకు బలం చేకూర్చు. కంగారు పడవద్దు. నీ మనస్సుకు బలం చేకూరితే ఏదైనా విషయం వచ్చినా తట్టుకొనే శక్తి వస్తుంది.

మనస్సుకు బలం చేకూర్చమని చెపుతున్నారు. శరీరమునకు బలం చేకూర్చమంటే బలాన్ని ఇచ్చే ఆహారము తింటాము శరీరమునకు బలం వస్తుంది. ఆహారం తినటంవలన మనస్సుకు బలంరాదుకదా. మనస్సుకు బలం చేకూర్చటం ఎలాగ అని అడుగుతున్నాడు. నీవు సత్పురుషులతో సహవాసం చెయ్యి. మహాత్ములను విడిచిపెట్టవద్దు. ఈశ్వరుని ఆరాధించు. ఎవరైనా దుర్మార్గులు ఉంటే వారితో వివాదానికి వెళ్ళవద్దు వారిపట్ల ఉదాసీనంగా ఉండు. జ్ఞానులు చెప్పినమాటలు శ్రవణం చెయ్యి. ఒకటికాదు వీటిని అన్నింటిని కలిపి చేయటంవలన నీ మనస్సుకు ధృడత్వం వస్తుంది, ఏకాగ్రత వస్తుంది, శాంతి వస్తుంది. ఏకాగ్రత గల మనస్సు, ధృఢత్వంగల మనస్సు, శాంతముగా ఉన్నమనస్సు హృదయంలో ఉన్న వస్తువును అందుకొంటుంది. ఇవి అన్నీ చేయటం వలన నీకు మానసిక ఆరోగ్యం వస్తుంది. మానసిక ఆరోగ్యము నీ శారీరక ఆరోగ్యమునకు కూడా సహాయపడుతుంది. అందువలన ఈశ్వరుని ఆరాధించు, సత్పురుషులతో సహవాసం చెయ్యి, ప్రాణగతిని చూసుకో. వ్యర్థమైన పనులతోటి, వ్యర్థమైన గొడవలతోటి నీ ప్రాణశక్తిని వృధాపరుచుకోవద్దు. నీ ప్రాణశక్తిని సద్వినియోగపరచుకోండి. నీ ప్రాణశక్తిని సద్వినియోగ పరచుకున్నప్పుడు ఆద్యాత్మికంగా కూడా పురోగమనం వస్తుంది. ప్రాణశక్తి పరిణామంలో ఆధ్యాత్మిక శక్తిగా పరిణమిస్తుంది. అందువలన ప్రాణశక్తిని వృధా చేసుకోవద్దు అని భగవంతుడు పదే పదే చెపుతున్నాడు.

మీరు చెప్పిన పనులు అన్నీ చేస్తాను అనుకోండి, నా మనస్సుకుదురుపడుతుంది, నా మనస్సుకు శాంతి చేకూరుతుంది అనుకోండి తరువాత ఏమి చేయాలి అంటున్నాడు. ఇప్పుడు నీవు దుఃఖముతో బాధపడుతున్నావు కదా. ఆ దుఃఖమునశిస్తుంది అంతకంటే నీకు ఏమికావాలి అంటున్నారు భగవాన్. దుఃఖము నశిస్తుంది.

ఆనందము ప్రాప్తిస్తుంది. నీవు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకుంటున్నావో అదిపోతుంది. నీవు పోగొట్టుకోవలసినది పోగొట్టుకుంటే నీ స్వభావములో ఉన్నది శాంతే. నీ అహంభావన వలననే నీ స్వభావము నీకు తెలియటంలేదు. ఈశ్వరుని ఆరాధించటంవలన, సత్పురుషుల సహవాసం వలన నీ అహంభావన నశించి నీ స్వభావం దొరుకుతుంది. నీ స్వభావములో ఉన్నది శాంతి, ఆనందమే. అప్పుడు నీకు కొత్త జన్మ వస్తుంది.

ఆయనతో చిన్నప్పుడు చదువుకున్నవారు ఎవరైనా వస్తే భగవాన్ అంటూఉండేవారు మీతో చదువుకున్న వెంకటరామన్ ఇక్కడ లేడు. వాడు చనిపోయాడు, ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు తెలియదు. నేను చెప్పినా మీకు అర్థంకాదు అనేవారు. అంటే నూతన జన్మ.

మనిషిని చంపకుండా చంపే మందు ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము మీ దేహమును తీసివేయదు, మీ ప్రాణమును తీసివేయదు, మీ అహంభావనను తీసివేస్తుంది. మీరు ఈ దేహంలో ఉండగానే అహంభావన నశించి మీకు ఆత్మజ్ఞానము ఉదయిస్తుంది. అజ్ఞానము నశించి మీకు జ్ఞానము ఉదయిస్తుంది. అది ద్విజన్మ అంటే కొత్త జన్మ వస్తుంది. ఆత్మ జ్ఞానము దేహమును చంపదు. దేహమునకు పరిమితమైన బుద్ధిని చంపుతుంది. అప్పుడు నూతన జన్మ వస్తుంది. ఇప్పుడు మనము దేహము ఎక్కడ ఉంటే అక్కడ ఉన్నాము అనుకొంటున్నాము. మీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో జ్ఞానం ఆత్మకంటే భిన్నంగా లేదు ఆత్మ అంతటా వుంది. కాబట్టి మనం అంతటా ఉన్నాము అన్న సంగతి మీకు తెలుస్తుంది. అహంభావన ఎప్పుడైతే నశించిందో ఆత్మే నేనుగా అనుభవంలోనికి వస్తుంది. అందులో ఉన్నది శాంతి, ఆనందము. అది ఎటువంటిది అంటే నా నోరు చెప్పలేదు, నా మనస్సు ఊహించలేదు. ఇంక దానిగురించి నేను ఏమని తెలియజెయ్యగలను. నోటికి, మనస్సుకు అందకపోయినా నీ అనుభవానికి అది అందుతుంది.

చనిపోయిన తరువాత ఏమౌతాము అని కంగారుపడవద్దు. ఇప్పుడు దేవుడు ఉన్నాడు అనుకొంటున్నాము కదా. ఇప్పుడు ఉన్నదేవుడే చనిపోయిన తరువాత కూడా ఉంటాడు. ఆయన మనలను చేయి పట్టుకొని తీసుకొని వెళతాడు. కంగారుపడవద్దు. ఈశ్వరుడిమీద ఉన్న విశ్వాసము తగ్గకుండా చూసుకోండి అదే నేను మిమ్మలను కోరుకొనేది. ఏతలంపులయితే బాధపెడుతున్నాయో, ఏ భావాలు అయితే నిన్ను బందిస్తున్నాయో వాటిని విడిచిపెట్టటానికి ప్రయత్నంచేయి. అదే సాధన. సాధన ఎంతవరకూ చేయగలిగితే అంతవరకు చేయి. సాధనమానవద్దు. నెమ్మదిగా ప్రయాణం చెయ్యి. కాలం కలసివచ్చినపుడు దేవుని అనుగ్రహం వస్తుంది. అప్పుడు నీ అహంభావనను తీసుకొని ఆయన స్వరూపమును నీకు ఇస్తాడు.

శాంతిగా ఉండి, కుదురుగా ఉండి, నిదానంగా ఉండి నీ ప్రయత్నం ఏదో నీవు చేసుకో. నీ ప్రయత్నం మానవద్దు. ప్రయత్నం అనేది ఎంత సహజముగా జరిగే స్థితికి రావాలంటే నీ ముక్కులో గాలి తిరుగుతోంది. అది నీకు తెలియకుండా, నీ ప్రయత్నం లేకుండా సహజముగా జరుగుతోంది. నీ సాధన అంతసహజముగా, అంత నిర్మలంగా ఉండాలి. అప్పుడు నీవు తరిస్తావు. నీవు చేసే సాధన కృత్రిమంగా ఉండకూడదు.

మీకు మంచితనం ఉండాలి, తెలివి ఉండాలి. మీకు ఉన్న మంచితనం, తెలివి మీకు తెలియకూడదు. మీకు ఉన్నమంచితనం, తెలివి మీకు తెలుస్తూ ఉంటే మీకు రజోగుణం పెరుగుతుంది అంటున్నారు ఆచార్యులవారు. మీరు నిజంగా మంచి చేసినా నేను మంచి చేసాను, నేను మంచిచేసాను అనుకొంటూ ఉంటే ఇక్కడ మహాప్రమాదం ఉంది అని ఆచార్యాలవారు చెపుతున్నారు. నీవు చేసిన మంచిపని 10పైసలు ఉంటే, నీకు 90 పైసలు రజోగుణం పెరుగుతుంది. రజోగుణం నిన్ను బాహ్యముఖానికి త్రిప్పేస్తుంది, చీకటి లోకాలకు తీసుకొనిపోతుంది.

భగవాన్‌ను ఒక అమ్మగారు తిట్టి తరువాత ఏమీ అనుకోవద్దు అన్నారట. నీవు ఏమీ అనుకోవద్దు అని చెప్పినా నాకు మనస్సు ఉంటే నేను అనుకొంటాను. నీవు అనుకోమన్నా, అనుకోవద్దు అని చెప్పినా నాకు మనస్సు లేనపుడు నీ మాటలతో ఏమీ సంబంధము లేకుండా నేను ఏమీ అనుకోను. రహస్యం అంతా మనస్సులో ఉంది. మనస్సు ఉంది కాబట్టి దాచుకుంటాను. మనస్సు లేకపోతే ఎక్కడ దాచుకుంటాను.మనస్సు నశిస్తే అన్ని నశిస్తాయి.

మీరు ఈ జన్మలోనే ఇప్పుడే ఇక్కడే తరించాలంటే మీరు రోజూ చేసేపనే అహంభావన లేకుండా చేయండి. అవసరమనుకుంటే పనిచేయండి, అహంభావనకోసం పనిచేయవద్దు. అవసరమనుకుంటే మాట్లాడండి, అహంభావనకోసం మాట్లాడవద్దు. ఇవి రెండూ జాగ్రత్తగా చూసుకోండి. పెద్ద సాధన అవసరము లేకుండా క్రమేణా అహంభావన తగ్గిపోతుంది.

దేవుని గురించి నోటితో చెప్పుకుంటాము. అనుసరించేటప్పుడు అహంబావన ఎలా చెపితే అలా అనుసరిస్తాము. అనుదిన ప్రవర్తనలో అహంభావన ఎలా చెపితే అలా నడుచుకుంటాము. చెప్పుకోవడం దేవుని గురించి చెప్పుకుంటున్నాము. దేవునికి అనుకూలంగా మన ప్రవర్తనలేదు. మన ప్రవర్తన అహంబావనకు అనుకూలంగా ఉంది. దేవునికి అనుకూలంగా మన ప్రవర్తన ఉంటే దేవుడు తెలియబడతాడు. మన ప్రవర్తన అహంభావనకు అనుకూలంగా ఉంది కాబట్టి అహంభావన పెరిగిపోతూ ఉంటుంది. ఆ జన్మకు అజన్మ అహంభావన పెరుగుతుంది. వెళ్ళేవి చీకటి లోకాలు. దేవుని మాటలు చెప్పుకొంటున్నాము. అహంభావన చెప్పినట్లు నడుస్తున్నాము. అంటే అహంభావనకు దగ్గరగా ఉన్నాము, దేవునికి దూరంగా ఉన్నాము.

మనం పగలు ఏదైతే సాధన చేస్తామో ఆసాధన గాఢనిద్రలో కూడా కొనసాగుతుంది. నీవు జీవితం పొడుగునా ఏదైతే సాధన చేసావో మరణించిన తరువాత కొత్త శరీరము వచ్చేలోపు ఆ సాధన కంటిన్యూ అవుతుంది. దాని వలన వచ్చే జన్మలో సాధన తేలిక అవుతుంది.

ధ్యానం అంటే ఏమిటి అని అడుగుతున్నారు. నీ మనస్సులోనికి తలంపులు వస్తూఉంటాయి, ఉద్రేకాలు వస్తూఉంటాయి, కోరికలు వస్తూ ఉంటాయి, అక్కరలేని గొడవలు వస్తూ ఉంటాయి. మీ ఇంటిలోనికి కుక్క వస్తే ఎలా తరిమివేస్తారో అలాగ నీ మనస్సులోనికి వచ్చే అక్కరలేని గొడవలను తరిమివేయటానికి నీవు చేసే ప్రయత్నమే ధ్యానము అంటున్నారు భగవాన్.

అన్ని భయాలలోకి మరణభయం ఎక్కువ. ఎందుకంటే మరణం తరువాత మనం ఉండము అనుకుంటాము. మరణం తరువాత కూడా మనం ఉంటాము. నూటికి నూరు పాళ్ళూ మనం ఉంటాము. ఉండమోమోనన్న భావన వలన భయం కలుగుతోంది. మనం ఉంటాము అని తెలిస్తే మరణం అంటే భయం కలుగదు. ఎవడికి ఉంటాము అని తెలుస్తుంది అంటే ఆత్మానుభవం పొందినవాడికి మాత్రం మరణం తరువాత కూడా మనం ఉంటాము అని తెలుస్తుంది. ఎందుచేతనంటే మరణానంతరము కూడా ఉండేది ఆత్మ. ఆత్మ బుద్ధి ఉన్నవాడికి మరణానంతరము కూడా మనం ఉంటాము అని తెలుస్తుంది. దేహమే ఆత్మ అనుకోవడంవలన దేహము పోతే నేను పోతాను అనుకొంటాడు.

మనస్సు ఉంటే ప్రయత్నంచేయాలి. మనస్సు నశిస్తే ప్రయత్నం చేయటానికి ఏమీ లేదు. ప్రయత్నం చేసేది మనస్సు. అందువలన మనస్సు నశిస్తే ప్రయత్నం ఏమీ లేదు. మనస్సు ఉండగా ప్రయత్నం చేయకుండా ఉండాలన్నా నీవు ఉండలేవు. ప్రకృతి నీ చేత చేయిస్తుంది. మర్మం అంతా మనస్సులో ఉంది.

మనస్సు చిరిగిపోతే ఏమీలేదు.

భౌతికంగా చూస్తే రమణమహర్షి దేహము, మన దేహము దగ్గరగానే ఉన్నాయి. దగ్గరగానే కూర్చున్నాము. లోపలికి వెళ్ళి చూస్తే ఆయన ఎక్కడ ఉన్నాడో, మనం ఎక్కడ ఉన్నామో ఆయనకు మనకు ఎంతదూరమో అన్నారు చలంగారు.

మీరు బాగుపడకుండా ఇతరులు బాగుపడాలి అనుకొంటే ఏమీ ప్రయోజనం లేదు. మీలో మార్పురాకుండా ఇతరులలో మార్పు రావాలి అనుకోవటం వలన ఏమీ ప్రయోజనం లేదు. నువ్వు ఎవడివో నీకు తెలిస్తే సహజంగా నీ ద్వారా ఇతరులకు శాంతి కలుగుతుంది, శక్తి కలుగుతుంది. ఇతరులకు నీ ద్వారా ఉపకారము జరుగుతుంది. మీరు జ్ఞానమును సంపాదించినపుడు ఇతరులకు శాంతిని ఇవ్వాలి అని మీరు అనుకోనక్కరలేదు, మీద్వారా శాంతి అందుతుంది, మిమ్మలను చూసి వారు బాగుపడతారు. నువ్వు శాంతిని సంపాదించు, జ్ఞానమును సంపాదించు దానిలో ఇతరులు వాటా పొందుతారు. జ్ఞానియొక్క హృదయంనుండి వచ్చే శాంతి తరంగాలు ఈ భూమిని తడుపుతాయి. శాంతిని ఇవ్వాలి అని అనుకోడు, అనుకునేవాడు అక్కడలేడు.

భగవాన్‌కు అరుణాచలేశ్వరుడి మీద ఉన్నప్రేమ చూడండి. దేవుడు తనకంటే భిన్నంగా లేడు అని చెప్పిన ఈ రమణమహర్షి, జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కూడామనో కల్పితములు అని చెప్పిన ఈ రమణ మహర్షి ప్రాణం పోవటానికి కొన్ని క్షణాలముందు అరుణాచలశివనామం విని బొటబొటా కన్నీరు కార్చారు. కొన్ని క్షణాలలో ఆయన శరీరం విడిచిపెడతారు అనగా అక్కడివారు అరుణాచలశివ నామం చేస్తున్నారు. అప్పటివరకు ఆయన కళ్ళు మూసుకుని ఉన్నారు. అరుణాచలశివనామం ఆయన చెవిలో పడగానే కళ్ళు తెరిచారు, ఆనందభాష్పాలు రాల్చారు. ఆ timeలో ఎవరో మంచి నీళ్ళు ఇవ్వటానికి, అక్కడకు రాగా వద్దని చెయ్యి అడ్డం పెట్టారు. ఆ నామం వింటూ మంచినీళ్లు త్రాగటం కూడా ఆయనకు అడ్డు అనిపించింది. అరుణాచలేశ్వరుని మీద ఆయనకు ఉన్న ప్రీతి, ప్రేమ ప్రాణం పోయే టైములో కూడా ఆపుకోలేక ఆనందభాష్పాలు రాల్చారు. అరుణాచలేశ్వరుని మీద భగవాన్‌కు ఉన్న ప్రేమ అటువంటిది.